


ఆచార్య గదిలోకి నేను వెళ్ళేటప్పటికి అతను అక్కడ కూర్చుండి ఉన్నాడు. భవిష్యత్తు విప్పి చెప్పగల మహా పండితుడిగా అతన్ని ఆచార్య పరిచయం చేశాడు. తాను సిగరెట్టు వెలిగించి మరొక సిగరెట్టు బికారీ చరణ్‌కి అందిచ్చాడు. ఆ శనివారం సాయంకాలపు చీకటి అప్పుడే దట్టం అవుతూ ఉంది. ఆ గదికి అవతల గుబురుగా పెరిగివున్న చెట్లలో చీకటి అలుముకుంది. బికారీ చెట్లవైపు చీకటిలోనే కూర్చున్నాడు. ఆ చీకటిలో అతడు సిగరెట్టు అంటించడానికి ముఖం చాపితే ఆచార్య అగ్గిపుల్ల వేశాడు. ఆ అగ్గిపుల్ల వెలుతురులో బికారీ ముఖం బాగా కనిపించింది. అతను చూడడానికి విచిత్రంగా ఉంటాడు. వికృతమైన ఆకారం. వయస్సు యాభై సంవత్సరాలు దాటకపోయినా పళ్లు చాల వరకు ఊడిపోయాయి. మిగిలిన కొద్ది పళ్లు నిత్య తాంబూలసేవనంవల్ల గారెక్కి నోరు తెరచినప్పుడు అతని వికారస్వరూపాన్ని మరింత యినుమడింప చేస్తాయి. పై దవడలు చప్పబడిపోయాయి; బుగ్గలు సొట్టపడుతూ ఉంటాయి. నుదురుమీద పెద్ద మడతపడి నట్టు ఉంది — జీవితంలో అనుభవాలన్నీ తలలో ఆకట్టుకున్నట్టు ఆటకారం చేస్తూ ఉంటుంది. కన్నులు రెండూ చిన్నవైనా ఒక కన్ను కొద్దిగా మెల్ల ఉండడం చేత ఎవరికేసి చూచినా ముఖం ఓరగా పెట్టి చూస్తాడు. అలాగ చూసేటప్పుడు తరచు తల ఆడిస్తూ ఉంటాడు. బాగా అలవాటు పడితే తొలిసారి అతన్ని చూచేవాళ్ళకి ఆ వికృత స్వరూపం చూచి భయం వేస్తుంది. ఆచార్య గదిలో ప్రతి సాయంకాలం పది మంది చేరుతూ ఉంటారు. అందులో శని వారం సాయంకాలం వారాంతం సెలవు దినాలు అవడంవల్ల ఆఫీసునించి అలసి వచ్చినవారికి ఆచార్యగది ఒక ఆశ్రయం - ఆశ్రమం అయింది. ఆ శనివారం కూడా వాడుక ప్రకారం అతనియింటికి వెళ్ళేటప్పటికి యీ విచిత్రవ్యక్తి కనిపించాడు. కాని అపూట జనం అట్టే లేరు. ఆచార్య-నేను - మరొక యిరుగుపొరుగు మనిషి - ఆ 'బికారీ' ఇంతే. ముందు చీకటిచాటున క్రీనీడలో కూర్చున్న 'బికారీ'ని నేనంత గమనించలేదు. ఆచార్య పరిచయం చేసిన తర్వాతకూడా నాకంత కుతూహలం కలగలేదు. కాని సిగరెట్టు వెలిగిస్తున్నప్పుడు అతని ముఖం చూస్తూ ఉంటే ఒక వెగటు, వింత నన్ను ఆవహించాయి. 'బికారీ' తల ఆడిస్తూ ఓర చూపుతో నాకేసి పరీక్షగా చూచాడు.

భవిష్యత్తులోకి తొంగిచూచి పుస్తకంలాగ చదవగలిగే అపూర్వవ్యక్తి తటస్థపడితే తన భవిష్యత్తు చదివించుకోవాలని ఎవరికి సరదా కలగదు? ఇలాంటి విషయాల్లో నాకు అసలు నమ్మకంలేదు. ఎంతోమంది కనిపిస్తూఉంటారు; చేతులు చూస్తారు; జాతక చక్రాలు వేస్తారు. వాళ్ల మామూలు ధోరణిలో ప్రస్తుత పరిస్థితులు బాగాలేవని, త్వరలోనే మంచి రోజులు రాబోతూ ఉన్నాయనీ, దానికి కొన్ని గ్రహపూజలు చెయ్యవలసి ఉంటుందనీ అలాగచేస్తే పాపగ్రహపీడ పోతుందని యిలాంటి ధోరణిలో చెప్తారు. నమ్మించి డబ్బు గుంజుకుంటారు. కూటి కోసం కోటివిద్యలు!

కాని 'బికారీ' అటువంటివాడు కాడు. అతని ముఖం చూస్తేనే తెలుస్తుంది అటువంటి మోసం తెలిసినవాడు కాడని. అతనికి ధనాపేక్ష లేదు. మనం ఎంతయిస్తే అంత తీసుకుంటాడు. అసలు ఇవ్వకపోయినాగాని కించపడే మనిషి కాదు. ఆచార్యమాత్రం—అతని క్షేమంకోరి హస్త రేఖలు చూపించేవాళ్లందరివద్దా అయిదేసి రూపాయలు వసూలు చేస్తున్నాడు. 'బికారీ' ఒక విచిత్రమైన కొంటెచూపుతో ఆకలిగా నవ్వుతున్నాడు. నా చెయ్యి విప్పి 'బికారీ'కి అందించాను. ఆచార్య నన్ను వారించి యిప్పుడుకాదు, రేపు ఉదయం అతన్ని సంప్రతించు అన్నాడు. కారణం, 'బికారీ' పూటకు ఒక మనిషి భవిష్యత్తుకంటె ఎక్కువ చెప్పలేడట. కొద్ది క్షణాలక్రితమే ఒక యింజనీరు చెయ్యిచూచి చెప్పాడట. ఒకరికి చెప్పే సమయంలో అతనికి విపరీతమైనభారం అనుభవించి బాధపడవలసి ఉంటుందట. ఒకసారి చెప్పివేసిన తర్వాత ఎంతో తేలిక పడినట్టు నిట్టూర్పు విడుస్తాడట. అప్పుడే భవిష్యత్ విచారణ ముగించి వాళ్ళు లోకాభిరామాయణంలో పడ్డారు. నేను కూడా ఆ కాలక్షేపంలో కలిశాను. పోనీ తొందర ఏముంది? మన్నాడు ఆదివారం ఉదయం ప్రశాంతంగా నాయింట్లోనే యీ పండితుణ్ని రప్పించి సంప్రతించవచ్చని నిశ్చయించుకొన్నాను. ఉదయం కాఫీకి మాయింటికే రావలసిందని 'బికారీ'ని మా మిత్రుడు ఆచార్యనుకూడా ఆహ్వానించాను. వాళ్లు 'సరే' అన్నారు.

'బికారీ' ఇక్కడికి వచ్చి పదిరోజులు మాత్రం అయింది. రాగానే అతని భాగ్యరేఖ బయటపడి ఆచార్యతో పరిచయం కలిగింది. ఈ పదిరోజులలోనూ నూరు రూపాయలు అతను కళ్ళచూశాడు. అతను చేతులు చూచిచెప్పిన ప్రతివాళ్ల విషయంలోనూ—చిత్రం అదేమిటో—అక్షరాలా నిజం అయ్యాయి. హెడ్‌గుమాస్తాగోపాలం చెయ్యి చూచి అతని పెద్ద కూతురికి పెళ్లి


ఉగాది
అభివందనాలు

మా తెలుగు క్రాస్‌వర్డు పజిలు పోటీదారులకు, ఆంధ్రప్రజలకు "నందన" నామ సంవత్సరము ఆనందదాయకము గాక!

SRI SATYA DEV & Co.,
Kachiguda, Hyderabad-Dn

మా పజిలు నెం. 24 కు పోటీచేసి
రూ 1,500 గెలవండి!
వివరములకు ఒక కార్డు వ్రాయండి

సంబంధం వచ్చిపోతుందని చెప్పాడుట. సరిగ్గా అలాగే అయింది. వైకుంఠ కృష్ణశర్మ చెయ్యి చూచి వారం రోజులలో నీకు మతిపోతుందని అన్నాడట. పాపం, అన్నంతపనీ అయింది; వారం రోజులు సెలవుమీద వెళ్ళాడు. సెలవుల్లో మలేరియా వచ్చాడు; మలేరియా తగ్గినవెంటనే వాడికి మతిపోయింది. స్కూలు మాష్టరు కేదారనాథ్ భవిష్యత్తు చూచి త్వరలో కుటుంబంలో ప్రాణనష్టం అంటే అలాగ చెప్పిన పదిరోజులు తిరగకుండా అతని తమ్ముడు అకస్మాత్తుగా రైలుప్రమాదంవల్ల మరణించినట్టు కబురు తెలిసింది. ఇలాగ ఇలాగ ఎన్నెన్నో విషయాల్లో వికారీ బాబు చెప్పిన మాటలు నిజమయ్యాయి. ఇదిగాక అతనిలో ప్రత్యేక చాకచక్యం ఎవ్వరికీ తెలియని అంతర రహస్యాలు కూడా బయటపెట్టడమే. మెడికల్ కాలేజీలో ఆ క్రొత్త ప్రొఫెసరు "జలానీ" మొదటి భార్య ఉండగానే రెండో ఆవిడతో (హాస్పటలులో హౌస్ సర్జన్) ప్రేమకలాపాలు జరుపుతూ ఉన్నాడని ఎవరికి తెలుసు? సప్లై ఆఫీసరు 'సదానంద్' తో కాపురం చేస్తున్న ఆవిడ స్వంత భార్య కాదనీ 'ప్రియురాలు' అని 'వికారి' ఆరాతీసేవరకు ఎవరు ఎరుగుదురు? ఒకటేమిటి ఎన్నైనా ఉదాహరణలు ఇయ్యవచ్చు వికారీ చెప్తున్న మాటలు అమోఘంగా నిజమవుతున్నాయని.

అందుకే ఇలాంటివాటిమీద ఏమీ నమ్మకం లేని నాకు కూడా విశ్వాసం కుదిరి అతనిని మా యింటికి పిలిపించాను.

భవిష్యత్తుగురించి ఎవరు సంప్రతించినా గాని అడగదలచుకొన్న విషయాలు రెండే ప్రణయమూ, భాగ్యమున్నూ.

వర్తమాన పరిస్థితులు అనుకూలంగా లేకపోతే-భవిష్యత్తుమీద ఆశపెట్టుకొని బ్రతుకు ఈడ్చుకొనిపోవడం మానవుని నైసర్గిక స్వభావం. ఎప్పటి కపుడే ఆ భవిష్యత్తు వర్తమానంలోకి మారిపోయే టప్పటికి నిన్నటికీ, నేటికీ రేపటికీ అట్టే భేదం కనిపించదు. తనకు లభించినదానితో తృప్తి పొందక-ఏదో అందనివాటికి అర్రులు చాపడం కూడా మానవుడి దౌర్బల్యాల్లో ఒకటేమో! తీరా ఆ యందనివి చేతి కందేటప్పటికి వాటిలో ఆనందం నశించి ఆశాభంగం పొందుతూ వుండటం ఒక పరిపాటి అయిపోతుంది. ఆశ కల్పించుకోవడం భంగపడటం అదే జీవితం. భంగపడిన తన పరాజయాలు మరచిపోవడానికి కొత్త ఆశలు సృష్టించుకొంటాడు మానవుడు. అందుకే భవిష్యత్తుతో సంప్రతిస్తాడు. మొత్తంమీద మత్తు కలిగించే మాయలోపడితే తప్ప మానవుడు బ్రతకలేడు. నాలో ఉన్న ఇటువంటి దౌర్బల్యమే నన్ను కూడా 'వికారి' భక్తుణ్ణి చేసింది.

ఆదివారం ఉదయం- అనుకున్న సమయానికి వికారీ చరణ్ ఆచార్య సమేతంగా మా గృహం పావనంచేశాడు. కాఫీ, ఫలహారాలు పూర్తిచేసిన తర్వాత నేను చెయ్యి అందిచ్చాను. నేను అప్పుడే స్నానం చెయ్యడంవల్ల నా చేతులు శుభ్రంగానే ఉన్నాయి. వికారీబాబు తన వాడుక ప్రకారం సిగరెట్టు ముట్టించి, తన చొక్కా జేబులోంచి గుండ్రని భూతద్దం తీశాడు. మేము కూర్చున్న గదిలోకి తూర్పువైపు కిటికీలోంచి సూర్యకాంతి పడుతూ ఉంది. కిటికీదగ్గర కుర్చీ వేసి అక్కడ సోఫామీద కూర్చుండి అతన్ని చెయ్యి చూడమని అందించాను. చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు. చేతిలో ఎన్ని రేఖలున్నప్పటికీ అతడు పరీక్షగా చూసింది నా భాగ్యరేఖ. దానిమీదనే అతడు చాలసేపు దృష్టి కేంద్రీకరించి పరికించాడు. అతని మెల్లకన్నుతో ఓరగా చూస్తూ తల పంకిస్తూ ఉంటే, కుదురుగా బంగారపు గూడు కట్టుకొంటూ ఉన్న నా భవిష్యత్తు కదలించి ఎక్కడ నేల కూలదోస్తాడో అని భయం వేసింది. అరగంటసేపు అలాగ పరీక్ష చేస్తూనే ఉన్నాడు. అంతసేపు నిశ్శబ్దం. తదేకదీక్ష. ఉలకడు పలకడు; ఆచార్య కూడా చూస్తున్నాడు గాని పలకరించడం లేదు. ఎప్పటికీ నోరు మెదల్చకపోతే నాకు విసుగెత్తింది. చెయ్యికూడా లాగుతోంది. చూస్తున్నంతసేపు 'వికారి' ముఖంలో నా కష్టసుఖాలు సుడిగుండాలు పడి తిరుగుతూ ఉన్నట్టు ఎన్నో కళవళికలు కనిపించాయి. ఒళ్ళంతా కంపించిపోయింది. అన్ని కండరాలా, అన్ని నరాలా ఆ ముఖంలోకి వెళ్ళి చుట్టుకొని పోయి ఎన్నో వికారాలు పొందుతూ ఉన్న ఆ ముఖం కనిపించింది. ఆ చప్పిదవడలు, బోసినోరు, మెల్లకన్ను, విరుగుగా పెరిగిన జుట్టు అతని వికృతముఖాన్ని మరింత వికృతం చేశాయి. ఎంతో బాధ, భారం, మథన ఆ ముఖంలో కనిపిస్తూ ఉన్నాయి. చివరికి మబ్బుల్లో వెన్నెలలాగ అతని కళ్ళు చిరునవ్వుతో మెరిశాయి. ఈ మథన పడటం తర్వాత ఒక పెద్ద వెలుగు కనిపించినట్టు, అతని చిన్న కళ్ళు కొంచెం పెద్దవి అయ్యాయి. భూతద్దంతీసి సంచిలో పెట్టి, జేబులోకి మార్చేశాడు, నా చెయ్యి తీసేసుకోమన్నాడు. ఆచార్యదగ్గర ఒక సిగరెట్టు తీసుకొని జీవితం అంతా ఒక గుక్కలో పీలుస్తూ ఉన్నట్టు పీల్చాడు.



అతని తలలో ఇంతసేపు పేరుకొన్న భావాలు ఒక్కసారి బయటికి వచ్చినట్టు వికరెట్టు పొగ చక్రాలు చుట్టుకొని ఎగురుతూ ఉంది. అతను ఏదో గొణుగుతూ చెప్తున్నాడు. ఆ బోసినోరులోంచి వచ్చే మాటలు అంత చప్పున అందరికీ బోధపడవు. పైగా అతని భాష వేరు నా భాష వేరు. ఆచార్య నాకు అర్థం విడమరచి చెబుతున్నాడు. నేను కొత్తగా బడికి వెళ్ళిన పిల్లవాడిలాగ మౌనంగా కూర్చుండి వింటున్నాను. అడ్డుమాటలు లేవు ముందు అతను చెప్పేదంతా వినడమే!

హస్తరేఖలు చూచినంతమాత్రం చేత అట్టుపుట్టు ఆనవాళ్లు ఎలాగ తెలుస్తాయో? ఆశ్చర్యం నా జీవితంలో జరిగిపోయిన సంగతులన్నీ పూసగ్రుచ్చినట్టు చెప్పివేశాడు. నా పుట్టుక, నా విద్యాభ్యాసం నావృత్తి, వివాహం అన్నీ సరిపోయాయి. క్రిందటి సంవత్సరం మేము ఇల్లుకట్టడం, మాకు ఒక చంటిపాప పుట్టి గతించడం ఇవన్నీ చెప్పగలిగాడు.

గతం—అందరూ చెప్పగలరంటారు. భవిష్యత్తువిషయంలోనే నన్ను ముఖ్యంగా బాధిస్తూఉన్న పెద్దప్రశ్న నాకు బదలీ ఎప్పుడు అవుతుంది అని ఈ ఊరు వచ్చి రెండు సంవత్సరాలుపైగా అయింది ఇక్కడ పరిస్థితులు ఏమీ అనుకూలంగా లేవు ప్రతి క్షణమూ ముళ్లమీద నించున్నట్టే, మన శ్శాంతి లేదు; సౌకర్యం లేదు నరకయాతన అనుభవిస్తూ ఉన్నట్టు భావించడం. నాకేకాదు నాతో ఉన్న సహోద్యోగులకి కూడా ఈ ఊరులో ప్రవాసం ఎప్పుడు వదలిపోతుందిరా దేవుడా అన్న చింత బాధిస్తోంది. 'బికారీ'ని ఎవరు సంప్రతించినా వేస్తున్న ప్రశ్న ఇదే. "నాకు ఈ ఊరునించి ఎప్పుడు బదలీఅవుతుందని" నా విషయంలో 'బికారీ' ఈ ప్రశ్నకు సూటిగా జవాబు చెప్పలేదు. దానికి బదులు నా ఉద్యోగం మార్పు అవుతుంది అన్నాడు. హోదా, జీతం, అన్నీ సమానంగానే ఉండి చేస్తున్న పని మారుతుంది అన్నాడు. నాకు ఆశ్చర్యం వేసింది. అలాంటి మార్పువస్తే బదలీ కావాలే అని ముందు సంతోషపడ్డాను. కాని 'బికారీ' అటువంటి ఆశ కల్పించలేదు. ఉద్యోగం మార్పు జరిగినా ఊరు మార్పు లేదన్నాడు. మళ్ళీ నిస్పృహ కలిగింది. కాని ఇలాంటిది జరిగే సంభవం లేదే అన్నాను. నమ్మలేకపోయాను. అతడు పెట్టిన గడువుకూడా అల్పకాలమే. వారం, పదిరోజులు మాత్రమే. చూద్దాం అని లేచాం. ఆచార్య, బికారీ వెళ్ళిపోయారు.

అతడు చెప్పిన గడువు పూర్తిఅయిందిఽ పదిరోజులూ పూర్తికాకుండానే నాకు తలవని తలంపుగా ఊహించడానికి వీలులేని మార్పు వచ్చింది. ఉద్యోగం మార్పు, హోదా, జీతం మరి దేనిలోనూ మార్పు లేదు బికారీ చరణ్ విచిత్రవ్యక్తి, అమోఘవాక్కు. ఒక్క నా విషయంలోనే కాదు ఎంతోమంది విషయంలో బికారీ చరణ్ వాక్కు నిజమయింది. అన్నింటికంటె పెద్దపరీక్ష 'ఆచార్య' విషయంలో. అతనికి బదలీ ఎప్పుడు అవుతుందని? మార్చి 15 వ తేదీలోపున బదలీ అయితీరుతుంది; కబురు తెలుస్తుంది. వెంటనేమాత్రం వెళ్ళవు మరి ఒకటిన్నర మాసాల తర్వాత మే నెలలో వెళ్తావు అన్నాడు. మార్చి 14 వ తేదీ శనివారం. 15 వ తేదీ ఆదివారం. ఏదైనా ఆర్డరు వచ్చిఉంటే శనివారం రావలసింది; రాలేదు. ఆచార్య ఆశాభంగం పొందాడు. బికారీమాటలు పొల్లుపోయినట్టు లెక్క వేసుకున్నాను. ఆదివారం ఉదయం అతడియింటికి పిలిచి యింతేనా నీ జోస్యం అని వెటకారం చేశాడు బికారీ తన మెల్ల కన్ను పెద్దచేసి తల పంకిస్తూ 'అప్పుడే ఎక్కడయింది యీ వేళ సాయంకాలం వరకు చూడండి' అన్నాడు

ఆశ్చర్యం! ఆ వేళ సాయంకాలం 9 గంటలకు ట్రంకు టెలిఫోనులో ఆచార్యను బదలీ చేస్తూఉన్నట్టు ఖబురు తెలిసింది. ఆచార్య షికారువెళ్లి తిరిగి యింటికి వచ్చేటప్పటికి ఈ శుభవర్తమానం తెలిసింది. అతని సంగతి అతడే నమ్మలేకపోయాడు. మరొకసారి తన విభ్రాంతి ఎరుకపరుస్తూ 'బికారీ చరణ్ ప్రమాదంరమైన మనిషి' అన్నాడు.

ఈ వార్త ఊరంతా అగ్నిజ్వాలలాగ వ్యాపించింది. తెలుసున్నవాళ్ళంతా ముక్కుమీద వేలు వేసుకొన్నారు. బికారీ చరణ్‌తో సంప్రతించడానికి కొత్త నీటికి చేపలు ఎగబడినట్టు ఎగబడ్డారు. బికారీ వ్యాపారం బాగానే సాగుతూఉంది. ఒకొక్క వ్యక్తిలో ఒకొక్క విశిష్టత ఉంటుంది. అదిమాత్రం పరిశోధన రాణింపుకు రాదు. అవకాశం రానివ్వరు. ఈ విశాల భరతఖండంలో ఇలాంటి సిద్ధపురుషులు పూజాపురస్కారాలు లేకుండా హతిమారిపోతున్నారో! భవిష్యత్తు చెప్పగల ఇలాంటి వ్యక్తి ఎక్కడికి వెళ్ళినా రాణిస్తాడు ఇది ఇంద్రజాల మహేంద్రజాలం కాదు; మాయలమారి విద్య కాదు; అతనిలో సహజమైన ఇంగితశక్తి, నేర్పు, ప్రజ్ఞ. అది పూర్తి వినియోగంలోకి రావడానికి ఈ అభాగ్య దేశంలో అవకాశాలు లేవు. ఇతన్ని అమెరికా పంపిస్తేనో! డాలర్లు అభావంగా ఉన్న మనదేశానికి ఎంతయినా ఉపకరిస్తాడు. కోటీశ్వరులూ, గుత్తదారులూ ఉన్న అమెరికా దేశంలో ఇటువంటి వాడికి తప్పక గిరాకీ కలుగుతుంది. ఈ సంగతి ప్రధానమంత్రి పండిత నెహ్రూకి తెలియజేస్తే భారతదేశ ప్రతినిధిగానూ, ప్రముఖ డాలరు సంపాదకునిగానూ బికారీరాయిని పంపిస్తాడేమో అనిపించింది. ఏది ఏమైనా ఆచార్య బదిలీఅయినప్పటినించీ బికారీచరణ్ అంటే నా శ్రద్ధాభక్తులు మరింత అతిశయించాయి. మళ్ళీ అతన్ని సంప్రతించాను. ఆచార్య, నేనూ కలిసి సంప్రతించాము. ఈమాటు నన్ను బాధిస్తున్న ప్రశ్న బదిలీ సంగతి. ఒక తారీఖు చెప్పి ఆలోపున అయితీరు




21,000 టాన్సిల్సు కేసులకు పైగా టాన్సినాల్ మందులచే ఆపరేషన్ లేకయే గ్యారంటీగా కుదిర్చెరి. సమస్త గొంతువ్యాధులకు మంచిమందు పత్యం లేదు. 40 రోజులకు 9-0-0. 20 రోజులకు 5-0-0.

నాష్ట్రినాల్ :-ముక్కులో కండలు పెరుగుట, వాసన తెలియకుండుట, తలనొప్పి వీటిని ఆపరేషన్ లేకుండా కుదుర్చును. పెద్దబుడ్డి 4-8-0; చిన్నబుడ్డి 2-8-0 అన్ని మందులషాపుల్లో దొరకును. ఆర్డరుతో ½ సొమ్ము అడ్వాన్సు పంపాలి. గొంతు, ముక్కు, చెవివ్యాధులకు టాన్సిల్సు & వైటాలిటీ స్పెషలిస్టు డాక్టర్ అప్పారావుగారి సలహా పొందండి.

టాన్సినాల్ లెబరెటరి 58, గోవిందప్ప నాయకన్ వీధి, మద్రాసు.

కుంది అన్నాడు. ఆచార్య అడిగింది అతని ప్రహోవర్ సంగతి, వివాహం సంగతిన్నీ. రెండూ కూడా ఫలానా తారీఖుల్లో జరుగుతాయని 'బికారీ' లిఖితపూర్వకంగా వ్రాసి యిచ్చాడు. కాని ఆ తారీఖులు ఇంకా చాల దూరంలో ఉండటంచేత మేమంతగా పాటించలేదు. అతడు వ్రాతమూలకంగా యిచ్చిన జోస్యవిశేషాలు మాత్రం మా స్వంత పెట్టెల్లో భద్రపరుచుకున్నాం.

ఏది యెలాగయినా బికారి విషయంలో నా కుతూహలం పోలేదు. ఇంత ఇటువంటి విశేషప్రజ్ఞ యీ వికృత పురుషుడికి ఎలాగ అలవడిందా అని జిజ్ఞాస బాధిస్తూనే ఉంది. ఒక రోజు ఆచార్య, నేనూ కూర్చుండి 'బికారీ'తో యీ మాట కదలవేశాం. అతను ఆ వేళ ఉత్సాహంగా ఉన్నాడు. మాకందరికీ కుతూహలం కలిగిస్తూ ఉన్న తన ప్రజ్ఞావిశేషం మొట్టమొదట తనకు ఎలాగ అలవడిందీ వివరిస్తూ చెప్పాడు. అదంతా ఒక పెద్ద కథ. నేను చెప్పేకంటె అతని మాటల్లోనే అనువదిస్తాను.

నేను మొదటినించీ యిలాగ 'బికారీ'గా లేను చిన్నతనంలో నేను కూడా అందరితోపాటు అష్టయిశ్వర్యాలు అనుభవించాను. తలిదండ్రులతో ఆప్యాయంగా పెరిగాను. మాది చాల ఉన్నత కుటుంబం. (అవును—అతని పెత్తండ్రి బిడ్డలు పెద్ద ఉద్యోగాలలో ఉన్నారు; పినతండ్రి పెద్దవ్యాపారి. మేనమామ బిడ్డలు రాజకీయ నాయకులు. ఒకడు అసెంబ్లీమెంబరు; ఒకడు జిల్లాబోర్డు అధ్యక్షుడు) ఇప్పుడా బంధుత్వం పురస్కరించుకొని వాళ్ళను నేనేమీ అడగను; ఆశ్రయించను. నా వాళ్ళని నేను గొప్పగా చెప్పుకోను కూడాను. ఆమాట అలాగ ఉంచండి మొదట్లో—అందరిలాగే నేనూ కాలేజీలో చదువుకొంటూ ఉంటే నాకు ఒక అమ్మాయితో పరిచయం కలిగింది. ఆ పరిచయం అంతకంతకు ముదిరి ప్రణయం అయింది. వాళ్లు కిరస్తానీమతం తీసుకున్నారు. ఆ పిల్లను నేను పెళ్లిచేసుకోవడానికి మా నాన్నగారికి ఎంతమాత్రం యిష్టంలేదు. అయినా సరే తెగించి నేను మతం మార్చుకొని పెళ్లిచేసుకుందామనుకున్నాను. పరీక్షలు అయిపోయిన తర్వాత సెలవుల్లో ఈ పని చేద్దామనుకున్నాను. నా ప్రణయ గాథ విన్నప్పటినించీ మా నాన్న నాకు చదువుకోసం పంపే సొమ్ము పంపడం మానివేశాడు. నేను హోటలులలోనూ, స్నేహితులవద్దా ఎన్నో అప్పులు చెయ్యవలసివచ్చింది. పరీక్షలు పూర్తిఅయ్యేటప్పటికి బాకీదారుగా తేలాను. నాకు మనశ్శాంతి లేకపోయింది. నా ఆర్థికదురవస్థ చూచి, నేను ప్రేమించిన అమ్మాయి కూడా నన్ను త్రోసివుచ్చింది. నేను వేరే సాయంకాలం వేళల్లో లెక్కల గుమాస్తాగా చేరి, సెలవుల్లో ట్యూషన్లు చెప్పి బాకీలనించి తేరుకున్నాను. పరీక్షాఫలితాలు తెలిసేటప్పటికి నా పరీక్ష పోయింది. చేతిలో రాగిదమ్మిడీ లేదు. నాన్న, వాళ్లు నన్ను కులభ్రష్టుని చూచినట్టు చూడటం మొదలుపెట్టారు. నా యింట్లో నేనే వెలిఅయ్యాను. డబ్బులేని నేను ప్రేమించిన అమ్మాయి దగ్గరికి వెళ్ళి ప్రేమభిక్షు వేడితే నన్ను నిరాకరించింది. వాళ్ళవాళ్ళు కూడా యీ ప్రణయమంత్రంలోంచి తప్పించుకోవడానికి ఆపిల్లకి వాళ్ళ సంఘంలోనే ఒక పెద్దవయస్సువాడిని చూచి పెళ్ళిచేశారు.

నాకు నాలుగువైపులా నిరాశ, నిస్పృహా నామీద నాకు ధైర్యం నశించింది. ఎందుకు వచ్చిన పాడుజన్మ? ఎవరికి ప్రయోజనం? ఇలా గతించిపోతేనే మంచిదని నాయంతట నేనే అంతమొందించుకుందాం అనుకున్నాను. లాభం లేకపోయింది. ఆ వేళతో నేను పనిచేస్తున్నచోట నాకు ఉద్వాసన చెప్పారు. ఎక్కడికి వెళ్ళడానికీ నా యన్నవారు లేరు. నా బంధువులు మొదలే వెలివేశారు. జన్మస్థలానికి వస్తే కన్నెత్తి చూచేవాళ్ళు ఉండరు.







రు 1000 బహుమానం

లెప్రసీ క్యూర్

(రిజిస్టర్డు)

కుష్ఠు, బొల్లి, సుఖరోగాదులకు గ్యారంటీ చికిత్స.

అన్ని భాషలలోను కేటలాగు ఉచితం.

లక్ష్మి అండ్ కో

(రిజిష్టర్డు)

H. O వాల్తేరు. ఆర్. యస్.

బ్రాంచీలు:

2/135 బ్రాడ్వే, మదరాసు.

గాంధినగర్, విజయవాడ.

కటక్, సికింద్రాబాదు,

రాజమండ్రి etc.



ఒక గంటలో యౌవ్వనము

కామస్తంభన

ధాతుపుష్టి, సంసారసుఖము నిచ్చుటలో సాటిలేనిది. విరాళచెందిన వృద్ధులయందు శక్తి, ఉత్సాహము నిచ్చును రు. 3-8-0

మదన మంజరి ఫార్మసీ

184, తైనా బజారురోడ్డు, మద్రాసు.

బెజవాడ—శ్రీనివాస మెడికల్ స్టోర్సు పార్కు రోడ్డు, రాజమండ్రి—ఈశ్వరదాస్ & కో. మెయిన్ రోడ్డు, నెల్లూరు ఆర్యన్ ఫార్మసీ.

పోనీ, ఎక్కడయినా పనికి ప్రయత్నిస్తే– ఎక్కడికివెళ్తే అక్కడ లేదు లేదు అని కసరి పొమ్మంటున్నారు. చివరికి జీవితమే విసుగు అయిపోయింది. కొన్ని రోజులు తిండిలేకుండానే ధర్మశాలల్లోనూ, రైల్వే స్టేషన్లలోనూ కాలక్షేపం చేసివేశాను. ఇంక ఆనాడు తెగించివేశాను. రైలుబండి స్టేషన్‌నించి బయలుదేరింది. ఒక మిత్రుడు తటస్థపడి స్టేషన్ రెస్టారెంటులో ఏవో అవీ యివీ నాకు తినడానికి ఇప్పించాడు. ఆకలి కడుపుకు అవే పంచభక్ష్య పరమాన్నాలులాగ కనిపించాయి. నేను అవి తిన్న తరవాత స్నేహితుణ్ని బండికి సాగనంపాను. బండి వెళ్లిపోయింది. తిరిగి నేను మిగిలిపోయాను. నాతోపాటు స్టేషనూ, అక్కడ స్టాల్సూ అన్నీ మిగిలిపోయి నాకేసి వెక్కిరింపుగా చూస్తున్నాయి. ఇంక బ్రతుకు దుర్భరం అనిపించింది. మరోక వైపునించి రైలుబండి వచ్చింది. అది స్టేషన్‌లో ఉన్నంతసేపు – ఆ పదిహేను నిమిషాలూ ఎలాగ గడిచాయో – క్షణం ఒక యుగంలాగ అనిపించింది. చివరికి బండి కదలడానికి సిగ్నల్ ఇచ్చారు. కదిలింది. కదుల్తూఉండగా చివర పెట్టెలో ఊచలు పట్టుకొని నిలబడ్డాను. దానితో నా జీవితాంతం అయిందనుకున్నాను. భయంకరమైన ఆఘాతంలో క్రిందపడిపోయాను. మళ్లీ నాకు తెలివి వచ్చేటప్పటికి నేను ఆసుపత్రిలో ఉన్నాను. నేను మాటలాడటం ప్రారంభించగానే డాక్టరు నా ఊరు, పేరు తలిదండ్రులు ఇవన్నీ విచారించి అడిగాడు. నేను ఒకటీ సరిగ్గా చెప్పలేదు. దిక్కులేని అనాథగా నన్ను వాళ్లు భావించారు. కొన్నాళ్ళకి తెలిసింది నాకు మూడు పెద్ద ఆపరేషన్లు చేశారనీ, కిగన్ను అంతా కుట్టుకుట్టి మార్చడంలో నా కన్ను మెల్లపోయిందనీ నా ఆకారమే మారిపోయి వికృతంగా తయారు అయ్యాననీ బోధపడింది. నా ముఖం పోల్చుకోవడానికి వీలులేకుండాపోయింది. జ్ఞాపకశక్తి ధారణశక్తి చాలా క్షీణించిపోయింది. నా చదువు, విజ్ఞానం ఏమైపోయాయో – ఈ పతనం తరవాత నా జీవితం మరింత నిరర్థకంగా కనిపించింది. దేనికోసం బ్రతుకు? ఎవరికోసం? తిరిగి జీవనసంగ్రామం ప్రారంభించాలి; అడుగడుగునా పరాభవాలూ, పరాజయాలూ, బ్రహ్మరాక్షసుల్లాగ నా వైపు కేలిచేస్తూ ఎదురవుతున్నాయి. పరిస్థితులు మానవుణ్ని లొంగదీస్తాయి. మానవుడు పరిస్థితుల్ని లొంగదీసుకోలేడు.

అందుకే ఎవరో వేదాంతి తత్వంలో చెప్పాడు– కాలమను ప్రవాహమున గడ్డిపోచగ నీదు మనుగడ-ఎలాగ ఈడిస్తే అలాగ త్రోసుకొని పోవలసిందే–మునిగినా తేలినా కాలవాహినిదయాధర్మాలమీద ఆధారపడి ఉంటుంది. జీవితంమీద విరక్తిపొంది ఇది అంతం పొందించుకుందాం అన్నా సాధ్యం కాలేదు. ఆకారవికారాలే మారిపోయాయి పూర్వ వాసనలూ ప్రేమ వాత్సల్యాలూ చలించిపోయాయి, నా ప్రేమ మన్నించేవాళ్లు గాని- ప్రతిఫలం– చూపించేవాళ్లుగాని



కుమారి కేవలలక్ష్మి (శ్రీ కేవల రామమోహనరావు బి.ఏ. గారి కుమార్తె. గవర్నమెంటు గరల్సు హైస్కూలు వార్షికోత్సవ సందర్భములో నటనా కౌశల్యమునకు రెండు పతకములు పొందిన విద్యార్థిని!

కనిపించలేదు. నా కుటుంబం వాళ్లే నన్ను కాదన్నారు; చిన్నబుచ్చారు. ఇంక నాకు ప్రేమ అనుకంప చూపేవాళ్లు ఎవళ్లు? లోకంలో తిండిలేక బ్రతకవచ్చు; గాలి, నీరు లేకపోయినా ప్రాణాలు భరించవచ్చు; నిన్ను ప్రేమించే వాళ్లు ఒకళ్లుకూడా లేకపోతే బ్రతకడం దుర్భరం. నామీద నాకే ప్రేమ నశిస్తూ ఉన్నట్టు అనిపించింది. అయినా- ఈ అనంతకోటి ప్రాణిజాలం ఎందుకు ఎలాగ దైనందిన జీవితం సాగించుకొంటూ బ్రతుకుతూ ఉన్నదో అలాగే నేనూ బ్రతకక తప్పదనిపించింది. మళ్లా జీవనభృతికి కావలసిన మార్గాలు వెదకడం ప్రారంభం చేశాను. మునపటిలాగే తిరిగి ఎక్కడికి వెళ్తే అక్కడ చుక్కెదురు. చదువుతో చేసే పని కాకుండా, కేవలం కండరాలతో చేసే పనిలో అయినా ప్రవేశించాలని అనిపించింది.


రోజు కూలికోసం ప్రయత్నంచేశాను. రెండురోజులు రోడ్డుపోసే పనిలో పని చేశాను. ఎప్పుడూ అలాంటి పనులు చెయ్యక ఒళ్లు హూనం అయిపోయింది. వాళ్లు ఇచ్చిన మూడు రూపాయలు మూడు రోజులలో అంతరించిపోయింది. మరి మూడు రోజులవరకు పనిలోకి వెళ్ళలేకపోయాను. అలిసి సొమ్మసిల్లి-మూడురోజులు ఒకటే నిద్ర అయిపోయింది. ఇంక యీరకం జీవితం నచ్చక మరోక గ్రామం వెళ్లిపోయాను. (ఇంకావుంది)


## శతమూలికాదిలేహ్యము

లోహాభ్రకసింధూరముతోసహా సేవించిన సమస్తమేహవ్యాధులు, ఎఱుపు తెలుపు మచ్చలు, బగ్గలు నపుంసకత్వము నివారించి వీర్యవృద్ధి, బలము, నరముల పటుత్వము కలుగజేయును స్త్రీలఋతుశూలలు, కుసుమరోగములు, నష్టసంతానము నివారించి మంచిసంతానము కలుగజేయును. 40 దినములకు మందు రు 18.

## శ్రీ భుజంగరాజవైద్యశాల

తాళ్ళరేవు, తూర్పు గోదావరి జిల్లా.



# భాగ్యరేఖ

(గతసంచిక తరువాయి)

ఆ సమయంలో సత్యాగ్రహం మంచి ముమ్మరంగా సాగుతూఉంది. కనిపించిన వారిని జెయిలులో పెట్టూఉన్నారు. టెలిగ్రాఫ్ తీగలు తెంపిన వాళ్ళను, తిట్టు సత్యాగ్రహం చేసేవాళ్ళను జెయిలులో పెట్టున్నారు. నామట్టుకు నాకు బయట బాధలు పడేకంటే జెయిలులోకి వెళ్తే నయం అనిపించింది. ఒక చిన్న సీధిలో ఉన్న పోస్టాఫీసు బోర్డు కిరసనాయిలు పెట్టి తగలపెట్టాను. పోలీసువాళ్లు వచ్చి నన్ను కొట్టి జెయిలుకు తీసుకుపోయారు. నేనుకూడా ఒక స్వతంత్ర వీరుణ్ణి అయ్యానన్న గర్వం కలిగింది. జెయిలులో నేనున్నది పదిరోజులు మాత్రమే. బయట జీవితంకంటె, జెయిలులో జీవనం ఎన్నోరెట్లు నాకు బాగుందనిపించింది. కాని ఇటువంటి నిష్ప్రయోజకుడికి

## శ్రీ సత్యనారాయణ శ్రీవాత్సవ

అంత గౌరవం యివ్వడం ఎందుకని ఆ జెయిలుఅధికారులకి కూడా తోచిందేమో! పదిరోజుల తర్వాత మేజస్ట్రేటు కోర్టులో విచారణ జరిగింది. నేను అంత వరకు అనుభవించిన శిక్ష చాలునని వదిలివేశారు. అయినప్పటికీ నాకు జెయిలుకి పోవాలన్న కోరిక చావలేదు. రైలుబండి నడుస్తూఉంటే మధ్య త్రోవలో 'అలారం చెయిన్' లాగి బండి ఆపివేశాను. ఏమిటి అంటే బండిలో జనాన్ని క్రిక్కిరిసి కూర్చోబెట్టినందుకు నేను సత్యాగ్రహం అన్నాను. నన్ను ప్రక్కస్టేషనులో దింపివేసి అక్కడఉన్న మిలిటరీ పోలీసువాళ్లు లారీలతో కుళ్లుపోట్లు పొడిచి వదలిపేశారు. తిరిగి నా జీవితం—సత్రం భోజనం మఠం నిద్రలోకి మారింది.

ఒక ధర్మశాలలో ఎవరో పెద్ద షాహుకారు సంతర్పణ చేస్తున్నాడంటే భోజనానికి వెళ్లాను. నాతోపాటు కొందరు 'సాధువులు' కూడా వచ్చారు వాళ్ళతో భోజనాలు పూర్తిచేసి—ఎవరు దారిని వాళ్లు వెళ్ళిపోగా ఆ ధర్మశాలలోనే ఒక గది ముందు పడక వేశాను. నా దగ్గరగా ఒక సాధువు వచ్చి నా పుట్టుపూర్వోత్తరాలు విచారించాడు. భాయి, అంటే భాయి అనుకున్నాం. ఈ బిచ్చగాని జీవితంలో ఉచ్చం నీచం అనే భేదాలుపోతాయి అందరమూ ఒకటే అన్నపూర్ణమ్మ బిడ్డలం. ఆస్తిలేదు; పాస్తిలేదు. గొప్పతనం నూపించి గర్వించతగ్గ విశేషం ఏమీలేదు. అంతా ఒకటే. నాతోడి సాధువును—అడిగాను. ఇంతేనా నా బ్రతుకు? ముందుముందు ఏమైనా బాగుపడే సూచనలున్నాయా' అని. అతను ఆప్యాయంగా చూచి—నాయనా! అధైర్యపడకు. అంతా ఆ పరమేశ్వరుడి లీల సృష్టించినవాడు బ్రతికించకపోడు. రాతిలో కప్పకు సైతం ఆ పరమాత్ముడు ఏదో ఆధారం చూపిస్తాడు. కాని మానవుడు తుచ్ఛమైన తోడిమానవుల్ని ఆశ్రయించి వాళ్ళ కరుణాకటాక్షాలకోసం అంతగా ప్రాకులాడతాడు కాని మానవాతీతుడు మహేంద్రమూర్తి అయిన పరమాత్ముడిమీద విశ్వాసం నిలుపుకోలేకపోతున్నాడు" అని వేదాంతం ఉపదేశించాడు. అపుడు నాకు చాల ఉడుకుమోతుతనం కలిగింది.

"పరమేశ్వరుడు ఉన్నాడా? ఉంటే ఎందుకు ఇన్ని బాధలు? నేనేం నేరం చేశానని నన్ను ఇంతగా వంచించి హింస పెట్టున్నాడు. ఏమో గురూ! నాకు అతడు లేడనే అనిపిస్తుంది."

"మంచిదే నాయనా! నీలో నాస్తికత కల్గడం, అంటే నీలో నిష్కపట భావం ప్రవేశించిందన్నమాట. లోకంలో భక్తి నటించేవాళ్ళు అందరూ భగవత్ ప్రసాదం పొందలేరు. ఈయాడంబరాలతో ఆలయాలకి వెళ్ళి భజనలుచేసి, భక్తులమని చెప్పకొనే వాళ్లు నిజంగా ఆరాధన చెయ్యడం లేదు. ఏవో క్షుద్రవాంఛలు కోరి వాటిని తీర్చవలసిందని భగవంతుడితో చిల్లరబేరాలు చేస్తున్నారు. అంటే, ఏది చేసినా దానికి ప్రత్యుపకారం కోరే పరమలోభిస్వభావం భగవంతుడికి కూడా ఆపాదించి సంతోషిస్తూ ఉన్నారు. వాళ్లకి కలిగిన భోగభాగ్యాలు తమ ప్రయోజకత్వంవల్ల యీ భక్తిశ్రద్ధలవల్ల వచ్చాయని భ్రాంతి పడుతున్నారు.

భగవంతుడు వాళ్లు ఊహించినంత అల్పుడు కాడు. వీటిని అన్నింటినీమించిన అతీతమూర్తి—సర్వాంతర్యామి—నీలో, నాలో, చీమలో, సింహంలో అన్నింట నిండియున్నవాడు, అందుచేత నేతనయందు


**గానకళాబోధిని**

గొప్ప సంగీత గ్రంథము చిన్నలు పెద్ద
లకు గవర్నమెంటు పరీక్షలకు ఉపయోగ
పడును సుమారు 800 పేజీలు గల పుస్త
కము వెల 10-0-0 పోస్టేజి వేరు

బాలసరస్వతి బుక్‌డిపో కర్నూలు




MANUFACTURERS
THE INDIA CANNING INDUSTRIES LTD.
VIJAYAVADA-2

For Madras City
Sovereign Sales Agency Ltd.,
11-12 Second Line Beach, Madras1.

అఖిల భూతములయందు ఒక భంగి చూచే వారిలో భగవంతుడు ప్రసన్నుడు అవుతాడు. నిష్కాపట్యం— నిజాయితీ ఎక్కడ ఉంటే అక్కడ పరమాత్ముడుంటాడు"

"లేదు స్వామీ! భాగ్యవంతుల చేతిలో భగవంతుడుంటాడు అన్న వాక్యం యీ ప్రస్తుత పరిస్థితిలో పరమ సత్యం"

'నీ బ్రతుకు నిస్సారం అలాగ అనిపిస్తుంది కాని నిజంగా భగవంతుడు-ఆత్మారాముడు ఆకలికడుపులలో ఆక్రోశిస్తున్నాడు. పేదల ఆక్రందనాలలో ప్రతిధ్వనిస్తున్నాడు. నిరాశాజీవుల నిస్పృహలో నిట్టూర్పు విడుస్తున్నాడు. లేదు లేదు అని నీవంటివాళ్ళు చెప్పే నిష్ఠుర వాక్యాలలో కూడా నిండు మనస్సుతో చిరునవ్వు నవ్వుతున్నాడు.'

'మీరు చెప్పింది నిజమే-కాని యీ నిర్భాగ్య జీవనం ఇంతేనా? ఎప్పటికైనా వెలుగు కనిపిస్తుందా? చూడండి నా భాగ్యరేఖ ఎలాగుందో' అని చెయ్యి అందించాను. ఆయన పెద్ద నవ్వు నవ్వి 'వెర్రివాడా? కాలం ఎల్లప్పుడూ ఒకేవిధంగా గడుస్తుందా? కొంతకాలం చీకటి. కొంతకాలం వెన్నెల. మిట్టపల్లాలు. అన్నీ ఓరిమితో దాటుకొని పోతూ ఉండాలి నీకు కావలసింది ఓర్పు-క్షమ—దానితో పాటు విశ్రాంతి.'

'నాకు కావలసింది విశ్రాంతి కాదు శ్రమే. నేనెలాంటి పనులయినా చెయ్యడానికి సిద్ధమే. పనిమాత్రం దొరకడం లేదు.'

'విశ్రాంతి అంటే. పనిలేకపోవడం కాదు. అనేక కష్టదుఃఖాలతో అలసి శ్రమపడిన నీ యాత్మకు విశ్రాంతి కావాలంటున్నాను. దానికి తగిన ఆశ్రయం కావాలి. ఋషీకేశంలో జ్ఞానానందస్వామి ఉన్నారు. వారి ఆశ్రమంలో ప్రవేశించు. నీకు విశ్రాంతీ, ఆత్మకు తగిన శాంతీ లభిస్తుంది' అని చెప్పి ఆ సాధువు తన త్రోవను తాను వెళ్ళిపోయాడు. నాకు మళ్ళీ కొత్త ధైర్యం వచ్చింది. చివరికి యీ మార్గంలో కూడా ప్రవేశించి చూడాలని తోచింది బయలుదేరి ఋషీకేశం వెళ్ళాను. పదిరోజుల ప్రయాణం-భయంకర కష్టాలు పడ్డాను. రాబోయే భాగ్యంముందు-ఆ కష్టాలన్నీ అవలీలగా దాటి చివరికి ఆ స్వామి ఆశ్రమం ప్రవేశించాను. నన్ను పలుకరించినవారే లేకపోయారు ఆ ఆశ్రమంలో. ఉన్నానో లేదో గమనించిన వాళ్ళు లేకపోయారు. తిండికూడా పెట్టినవాళ్ళు దొరకలేదు. ప్రాణం విసుకెత్తి ప్రక్కనే ఉన్న ఒక ధర్మశాలకి వచ్చిన యాత్రీకుల వద్ద ఆశ్రయించి కడుపుమంట చల్లార్చుకున్నాను. ఆశ్రమం పెద్ద యెత్తైన కొండ మీద ఉంది. అక్కడనించి క్రిందుగా ధర్మశాల ఉంది. ధర్మశాలకు చేరువగానే ఒక చిన్న మంటపం, దేవాలయం ఆనుకొని వున్నాయి. ఆ మంటపం సోపానాలు దిగి వస్తే-చాలా దిగువగా గంగాభవాని ప్రచండవేగంతో పరుగెత్తుతూ ప్రశాంత కలకల గానం చేస్తూ ఉంది.

ఆశ్రమంలో నాకు చోటు ఎలాగా లేదని ఆ మంటపంలో విడిదిచేశాను. స్వచ్ఛమైన ఆ గంగాప్రవాహంలో స్నానం - ఆ మంటపంలో ఉనికి; ఏ యాత్రీకులయినా ఏమైనా యిస్తే అదే నా జీవనం నిలిపేది. ఇలాగ మరొకవారం గడిచిపోయింది. ఈ వారంలోను ఒక స్వామిజీ మూడుసారులు గంగానదికి వచ్చి శిష్యసమేతంగా స్నానంచేసి వెళ్లారు. ప్రక్కవాళ్ళను విచారిస్తే వారే జ్ఞానానంద స్వాములు అని తెలిసింది.

ఒకనాటి సంధ్యాసమయం. అస్తమిస్తూ ఉన్న సూర్యబింబం - గంగానదిలో బంగారు కిరణాలతో స్వర్ణవాహినిలాగ కనిపిస్తోంది. ఆ సంధ్యవేళ చుట్టూఉన్న నిస్తబ్ధప్రకృతి అంతా కొత్త తేజస్సుతో తళతళ మెరసిపోతూ ఉంది. కొత్త శోభ గోచరిస్తూ ఉంది. ఆ సంధ్యాముహూర్తంలో చల్లని గంగాజలాల్లో స్నానంచేసి పొడిబట్టలతో ఆ మంటపం సోపానాల మీద కూర్చుండి ఉన్నాను. స్వామిజీ— శిష్యవర్గంతో వచ్చి స్నానం చేశారు. సంధ్యావందనం జరిగింది. వెండితీగలులాగ అలుముకొనిపోయిఉన్న ఆయన కేశజాలం - గడ్డం - బంగారువంటి ఆ శరీరం మీద ఎంతో మహత్తు ప్రకటిస్తూ ఉన్నవి. ఆయన సాక్షాత్తూ దివ్యపురుషుడే. ఈ లోకంలో ఆయన తిరుగుతూ ఉన్నాడే కాని అన్ని లోకాలూ ఆయనలోనే ఉన్నవేమో! సమస్త విశ్వరహస్యాలూ గ్రహించినట్టు ఆయన విశాలనేత్రాలు విప్పారిన దృష్టులతో ఏవో ఎవరికీ తెలియని విశేషాలు ఆకళింపజేస్తూ ఉన్నాయి. ఆ మహనీయుని చూడగానే నా ఆరాటమంతా పటాపంచలయింది. స్వామి వస్తూ ఉన్న మార్గంలో సాష్టాంగపడి ఆయన పాదాలకు మొక్కరిల్లాను. స్వామి తమ దయాపాంగ దృష్టులతో అనుగ్రహించారు. వెంట రమ్మని సైగచేశారు. ఆశ్రమంలో శిష్యుడిగా ప్రవేశించాను. అక్కడే భోజన మజ్జనాదులు. నిత్యనిధులకి లోపంలేకుండా జరిగిపోతూ ఉంది. కాని మనస్సులో మరొక కొత్త అశాంతి బయలుదేరింది. ఏదో తెలుసుకోవాలని ఉబలాటం. నేనేం కోరుతున్నానో నాకే తెలియదు. ఆవేళ స్వామి ఒంటరిగా ఉన్నారు. ప్రసన్న భావన చూచి సమీపించి మళ్ళీ సాష్టాంగ నమస్కారం చేశాను. ఏదో దివ్యతేజస్సు తనలో ఇముడ్చుకున్నట్టు అయింది.

"నీకేం కావాలి?" అని స్వామిజీ ప్రశ్నించారు మౌనదృష్టులతో.

అల్పసంతుష్టినైన నాకు అంతకంటె గొప్ప వరం కోరాలని బుద్ధి కలగలేదు. నా చెయ్యి చాచి, స్వామివారికి స్పష్టంగా చూపిస్తూ, "మహాత్మా! నా భవిష్యత్తులో, ఎలాగ ఉందో నా భాగ్యరేఖ చూచి చెప్పండి" అని అడిగాను. ఆయన చిరునవ్వుతో నా చెయ్యి తాకి నా కన్నులు స్పృశించారు. ఒడలంతా ఒక విద్యుత్ప్రసారం కలిగినట్టు జలదరించిపోయింది. ఒక కొత్త లోకంలోకి తీసుకొనిపోయి విడిచి యిక్కడ కన్నులు తెరచిచూడు అన్నట్టు అనిపించింది. నా నరాలన్నీ జ్వలించిపోయాయి. అకస్మాత్తుగా పెద్ద విద్యుచ్ఛక్తి ప్రవహిస్తే ప్రకాశించిన జ్యోతిలాగ నా శరీరం పులకరించిపోయింది. మొదట నేను సహించుకోలేకపోయాను. కొంతసేపు స్పృహతప్పి పడిపోయాను. నేను తెలివివచ్చి చూచేటప్పటికి స్వామిజీ పో—వెళ్ళిపో అని సంజ్ఞ చేస్తున్నారు. 'నీవు భాగ్యరేఖ చూడాలని చూశావు. ఎందుకు నీకు ఈ కుతూహలం! ఒకరు నీ భాగ్యరేఖ చూడటం ఎందుకు? నీ వే


## నారసింహ లేహ్యము




బంగారు చేర్చబడినది. మేహము, నిస్త్రాణ, నిస్సత్తువ శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 8-4-0 పోస్టేజి 12 అ.

పి. సి. ఏ. & కంపెని. "ఆయుర్వేదసమాజం"

పెరిదేపి- నెల్లూరు జిల్లా.

## అబలసుధ

స్త్రీల కుసుమ వ్యాధులు అకాల బహిష్టు, ఋతుబద్ధము, ఋతుశూల, ఒడలునొప్పులు, తలనొప్పి, గుండెదడ కాళ్ళ లాగుట, మనస్థిమితము లేకపోవుట, నిద్రపట్టకుండుట, నడుమునొప్పులు, బలహీనత, మలబద్ధము, హిస్టీరియా మొ॥ హరించును.

సీసా రు 3/- వి. పి. అ 0-14-0

ఇండియన్ మెడికల్ హౌస్,

లక్ష్మి టాకీసు రోడ్డు - విజయవాడ-2.

అందరి భాగ్యరేఖలూ చూచి వాళ్ళ భవిష్యత్తు చెప్పగలవులే పద!" అని చెప్పినట్టు అర్థమైంది. నేను మారుమాటాడలేదు. నా చేతిలో రేఖలు చూచుకున్నాను. అవన్నీ కదుల్తూఉన్న జీవాలలాగ కనిపించాయి. వాటికి ఎక్కడలేని శక్తి వచ్చి-అవి ఎక్కడికో నన్ను లాగుకొనిపోతున్నాయి. స్వామి ముందు నా చేతులతో పాదాలు స్పృశించి, ఆ మంత్రశక్తి కళ్లకు అద్దుకున్నాను. ఇదివరకు ఎన్నడూ లేని ఉత్సాహం వచ్చింది. నాలో కొత్త ప్రజ్ఞ బయలుదేరింది. నేను ఒక ప్రయోజకవంతుణ్ని అయ్యాను. నేను చదివినప్పుడు, సంపాదించినప్పుడు - ఆఖరికి నన్ను ప్రేమించిన ఒక స్త్రీ అనురాగాన్ని పొందినప్పుడు కూడా ఇంత ఆనందాన్నీ ఉత్సాహాన్నీ పొందలేదు. స్తబ్దుగా ఎప్పుడూ నిద్రపోతూ ఉన్నట్టు కునుకుపాట్లు పడే నాలో గొప్ప చురుకుదనం పుట్టుకొనివచ్చింది. ఏదో చేసివెయ్యాలని - ఎన్నో చెయ్యగలనని ధైర్యం! ఇదివరకు నన్ను గేలిచేసి నన్ను నిరాకరించిన నెట్టివేసిన లోకం నన్నీ మాటు 'ఎలాగ ఆదరిస్తుందో చూడాలి. లోకానికి భయపడి తప్పించుకొని పరారీ అయిన నేను తిరిగి లోకంలోకి వెళ్తున్నాను. పరిస్థితుల ప్రభావానికి పలాయనమంత్రం పఠించిన నేను తిరిగి పరిస్థితుల్ని నా ప్రభావంలోకి తెచ్చుకోవడానికి పరాక్రమిస్తున్నాను. ఇంతకీ అదొక మానసిక శక్తి. ముంగు నిర్వీర్యుణ్ణిగా చేసి నిస్పృహతో ఆత్మహత్యకు ప్రోసిందీ అదే—ఈనాడు—సమస్తాన్నీ జయించగల వీరాధివీరుడవు—పద ముందుకు పద అని విజృంభింప చేస్తున్నదీ అదే. అయితే ఈ శక్తి నాలో ఉన్నది. ఇన్నాళ్ళూ చూచుకోలేదు. ఒక మహనీయుడు వచ్చి నాశక్తి నాకు జ్ఞాపకం చేసేవరకు ఆ చింతనే లేకపోయింది'

ఇలాంటిశక్తి అందరిలోనూ ఉంటుంది. కాని ఎవ్వరో కాని తెలుసుకోలేరు. తెలుసుకోవడానికి ప్రయత్నం చెయ్యరు. ఎలాంటి పరమ వేదాంతమైనా యీ పరమ రహస్యాన్నే పరిపరి విధాల బోధిస్తూ ఉంది. 'నాయనా! నిన్ను నీవు తెలుసుకో—నీకు సమస్తం బోధపడతాయి' అని నన్ను నేను పూర్తిగా తెలుసుకోలేకపోయినా నాలోఉన్న కొత్తసామర్థ్యాన్ని గుర్తుపట్టాను. ముందంజవేశాను.

బికారీచరణ్ తన ఆత్మకథ చెప్తూ ఉన్నంతసేపు నేనూ ఆచార్యా కూడా అత్యంత శ్రద్ధతో విన్నాం. మాకు అత్యాశ్చర్యం వేసింది. ఆ ఆశ్చర్యం సరిపుచ్చుకోవడానికి మధ్య మధ్య ఏవో ప్రశ్నలు వేసేవాళ్ళం. అతను కూడా వానికి తగిన సమాధానాలు చెప్పేవాడు. ఈ భాగ్యరేఖలు చదివే సామర్థ్యం వచ్చినట్టు తొలిసారి యెలాగ తెలిసిందో వినాలని కుతూహలం కలిగింది.

'బికారీబాబు! సరే. ఇది గురువుల ప్రసాదంవల్ల నీకీశక్తి కలిగింది అంటున్నావు. ముందు ఎవ్వరిమీద నీ మంత్రం ప్రయోగించావు అది యెలాగ పనిచేసింది' అని ఆచార్య అడిగాడు.

బికారీ మరొక సిగరెట్టు అంటించి 'అయితే వినండి చెబుతాను. తొలిసారి నా శక్తి నావాళ్ళమీదనే ప్రయోగించాను. అది చాల విచిత్రంగా జరిగింది...అదీ తమాషాగానే ఉంటుంది' అని మళ్ళీ మొదలు పెట్టాడు. మేము ఇద్దరమూ ఎప్పటిలాగే చెవులు రిక్కించి వింటున్నాము.

భవిష్యత్తులోకి చూచే ప్రజ్ఞాశాలి తన అనుభవం వర్ణిస్తూ ఉన్నాడు.

నాకీ తెలివికలిగిన వెంటనే స్వగ్రామంవెళ్లిపోయాను. ఇదివరకు నిరాదరణతో చూచిన వాళ్ళంతా నేనంటె ఆదరంతో చూడటం ప్రారంభించారు. మనిషికి తన సామర్థ్యం మీద ధైర్యం కలిగిన ఉత్తరక్షణంలోనే ఇతరులుకూడా అతని సామర్థ్యాన్ని గుర్తిస్తారేమో! నామీద 'వలి' లేదు, కులభ్రష్టత్వం లేదు. ఇంటికి తిరిగి వెళ్ళిన వెంటనే మాతండ్రి ఆప్యాయంతో పలుకరించాడు. తల్లి పుట్టెడు దుఃఖంతో పొంగి పొంగి యేడ్చింది. వాళ్ళను చూస్తూ ఉంటే, నాకుకూడా దుఃఖం పొంగి పొంగి వచ్చింది. మనస్సుతీర యేడ్చివేశాను. ఇన్నాళ్ళు అనుభవించిన దుఃఖాలన్నీ కన్నీటిధారలుగా నా చెంపలు తడిపివేశాయి. చంటిపాపగా కనిపించాను మావాళ్ళకు. పరారి అయినవాడు ఎలాగో ఇంటపట్టు చేరాడుగదా అని మావాళ్ళ సంతోషం. ఈలోపున నా చరిత్ర అంతా సవిస్తరంగా వాళ్ళకు తెలిసిందట. నేను రైలుబండిమీంచి పడటం, మూడు ఆపరేషన్లు చేయించుకోవడం, తిరిగి 'బికారి' గా తిరగడం, కాంగ్రెసు ఉద్యమంలో జెయిలులోకి వెళ్ళడం, అక్కడనించి ఋషీకేశ ఆశ్రమంలోకి వెళ్ళడం ఇవన్నీ తెలిశాయి. ఎలాగ నా ఆరాతీశారో నాకే ఆశ్చర్యం వేసింది.

నా పూర్వానుభవాలు చెప్పకోవడంతో, బంధు మిత్రులతో కొద్ది దినాలు ఖులాసాగా గడిపివేశాను. భవిష్యత్తు తెలుసుకోవడంలో నాకు కలిగిన కొత్త ప్రజ్ఞమాట ఎవరితోనూ చెప్పలేదు. నాయంతట నేను ఈ విషయమై ప్రచారం చేసుకోవాలనే కోరిక లేకపోయింది. నా హస్తరేఖలు నేనే చూచుకొన్నాను. భాగ్యరేఖ పల్చగా గులాబీరంగుతో కనిపిస్తూఉంది. అది చూస్తూఉంటే, కొత్త ఆశ కొత్త ధైర్యం అంకురించాయి. భవిష్యత్తులోకి ఒక కిటికీ తెరచుకొని అందమైన ఆనందమైన ఒక అరణ్యసీమ నాకన్నుల యెదట అత్యక్షమైనట్టు అయింది. నాయంతట నేనే భయపడి అది పరీక్షగా చూడటం మానుకొన్నాను.

మళ్ళీ ఈ ప్రసక్తి రాలేదు. మా 'మేనమామ' కు జ్యోతిషం అంటే కొద్ది అభ



మానం. వ్యవసాయం కాకుండా కోర్టు వ్యవహారాలలో తరచు తిరుగుతూ ఉంటాడు. నేను ఋషీకేశం వెళ్ళి, ఆశ్రమంలో ఉన్న ఆరా అతనే తీశాడట. అతడు ఒకసారి వచ్చి, 'ఏమిరా అబ్బాయి! స్వామి వారివద్ద ఉండి ఏమైనా జ్యోతిషం, వైద్యం వగైరా నేర్చుకున్నావా' అని అడిగాడు.

నేను ఏమీ బదులు చెప్పలేదు.

'నీ ముఖం చూస్తే ఏదో హస్తసాముద్రికం చెప్పగలవని తోస్తూఉంది - చెప్పు నాయనా' అని చెయ్యి అందించాడు.

నేను చెయ్యిపట్టుకుని వేళ్లు విప్పుతూ ఉంటే ఒళ్ళంతా కంపించిపోయింది. దీక్షగా చూచాను. ఏదో కుదిపి వేసినట్టు, కండరాలన్నీ కదలి నా మెదడులోకి వచ్చి, కన్నులవెనక కేంద్రీకరించి ఏవో తెలియని వర్తమానాలు చెవులో చెప్పుతున్నట్టు అయింది. అవి వింటున్నాను. ఏవేవో— తెరచిన పుస్తకంలోని వాక్యాలలాగ — ఆ రేఖలు కనిపిస్తూ ఉన్నవి. నేను యంత్రంలాగ మాటలాడివేశాను. మా మేనమామ కదలకుండా వింటున్నాడు. ప్రస్తుతం, ఒక కోర్టు వ్యవహారం అతన్ని బాధిస్తూ ఉన్నది. అతడు కొన్న ఒక యింటిగురించి తగాదా! అతని హస్తరేఖలు చూచి ఆ యిల్లు పెరడు, పెరటిలోని రావిచెట్టు, మదురు గోడలు, ఆ యింటి యజమానురాలు ఒక వితంతువు, మైనారిటీ తీరిన ఆమె కొడుకు ఇవన్నీ స్ఫురించాయి. ఇవన్నీ చెప్పి, ఈ తగాదా మూడురోజులలోపున రాజీ అవుతుందని, కొంత సొమ్ము ఖర్చు అయినప్పటికీ తగాదా మా మేనమామ పక్షానే పరిష్కారం అవుతుందని చెప్పాను. ఆమాట వినగానే మా మామ ఆనందానికి మేరలేదు. మూడురోజులూ మూడు క్షణాలలో గడచిపోయాయి. ఆవేళ కోర్టుకి వెళ్ళినవెంటనే ఆ యింటి యజమానురాలు, కొడుకూ కూడా వచ్చి తగాదాగురించి రాజీపడి మా మామపక్షం ఇల్లు క్రయం వ్రాసియిచ్చారు.

దానితో నా ప్రజ్ఞసంగతి మేనమామ అందరికీ చాటింపు నయ్యాడం మొదలు పెట్టాడు. ఈలోపున ఎందరు వచ్చినా నేను దీక్షగా చూడలేదు. యథాలాపంగా చూడటం ఏదో చెప్పి వేయడమున్నూ. నేను ఇంటికి తిరిగివచ్చేటప్పటికే కుటుంబంలో ఒక పెద్దచిక్కు బయలుదేరింది. అది మా పెద్దచెల్లెలు వివాహం. అది యీడుకివచ్చి నాలుగేళ్లు అయింది. మా నాన్నగారు ఎంతప్రయత్నం చేసినా వివాహం పొసగలేదు. ఎవర్ని చూచినా వేలకువేలు కట్నాలు అడిగేవాళ్ళే! కాని ఎంతో కష్టపడి ఒక సంబంధం చూచారు. వాళ్ళకు రెండువేలు ఇవ్వడం - వాళ్లు పిల్లకు వెయ్యిరూపాయల నగలు పెట్టడమున్నూ. ముహూర్తం నిశ్చయంచేశారు; ఇంక వారంరోజులలో వివాహం. శుభలేఖలు కూడా అచ్చువేయించారు. ఒక పూట నేను ఒక్కడినూ ముందు గదిలో ఉండగా పెళ్లికూతురు, మా పెద్ద చెల్లెలు లక్ష్మి గదిలోకి వచ్చి "అన్నయ్యా! నువ్వు చేతులు చూస్తావట. నా చెయ్యి చూచి చెప్పు" అన్నది. లక్ష్మికి నేనంటే చనువే. కాని నేను దేశద్రిమ్మరిని అయిపోయినప్పటికీ అందరికీ నాముందు కూడా 'మన్నన' అయిపోయింది. లక్ష్మి—అయినప్పటికీ తెగించి వచ్చివేసింది. దాని మనస్సులో భావం వేరు. ఈ సంబంధం దానికి నచ్చలేదు. అయినా నాన్న కుదిర్చినమీదట బలవంతంగా ఒప్పుకోవలసింది. పైగా రెండువేలు తన నిమిత్తం పోస్తూఉన్నారనేటప్పటికి దాని మనస్సు తరుక్కుపోతున్నట్టు అయింది. మరొకమాట—చిన్నప్పటినించీ మా మేనత్తకొడుకు ప్రసాద్‌ని దానికిస్తామని అనుకొంటూ వచ్చాం. మా నాన్నకీ, మావయ్యకీ ఉన్న వివాదాలవల్ల ఆయన కిష్టం లేకపోయింది. చివరికి ఈ సంబంధం నిశ్చయించారు. ముహూర్తం నిశ్చయమయింది పత్రికలు వేశారు.

నేను లక్ష్మి చెయ్యి చూచాను.

'అమ్మాయి! నీవు దిగులుపొంద నక్కరలేదు-నీకీ పెళ్ళి కాదమ్మా?" అన్నాను.

"అదేమిటన్నయ్యా? అన్నీ అయిపోతేను"

"అది వేరేసంగతి - యీ పిల్లవాడితో కాదు; మరొక పిల్లవాడితో అవుతుంది — అదే ముహూర్తంలో -తప్పక అలాగే జరిగి తీరుతుంది" అన్నాను. లక్ష్మి సిగ్గుతోనూ, ఆశ్చర్యంతోనూ ముఖం చూడకుండా లోపలికి వెళ్ళిపోయింది.

వారం రోజులు పెళ్ళి సన్నాహాలతో మా యిల్లు చాల హడావిడిగా ఉంది. లక్ష్మిని చివరి మూడు రోజులూ పెళ్ళికూతుర్ని చేసి రకరకాల అలంకరించి, ఆడవాళ్లు హాస్యం చేస్తూనే ఉన్నారు.

పెళ్ళికి బంధువులందరూ వచ్చారు. తెల్లవారితే 3 గంటలు అనగా ముహూర్తం. పెళ్లికొడుకుతరఫువాళ్లు సాయంకాలం వస్తారు. మా యింట్లో దూర బంధువులూ, దగ్గర బంధువులూ ఆ రోజు

(48-వ పేజీ చూడండి)




ఒక గంటలో యౌవ్వనము
కామస్తంభన
ధాతువృష్టి, సంసారసుఖము విచ్చుటలో సాటిలేనిది. విరాళమెందిన వృద్ధులయందు శక్తి, ఉత్సాహము నిచ్చును. రు 2-8-0
మదన మంజరి ఫార్మసీ
184, చైనా బజారురోడ్డు, మద్రాసు.
బెజవాడ—శ్రీవిపాద మెడికల్ హార్సు పార్కు రోడ్డు, రాజమండ్రి—ఈశ్వరదావ్ & కో. మెయిన్ రోడ్డు. నెల్లూరు: ఆర్యన్ ఫార్మసీ.

గనోక్వాల్
అన్నిసెగలకు గంటలలోగుణము
ఈశ్వర ఫార్మశి, రాజమండ్రి.

# భాగ్యరేఖ

(15-వ పేజీ తరువాయి)

ఉదయమే వచ్చారు. భోజనాలు అయిన తర్వాత విశ్రమించి మధ్యాహ్నం పూట పేక ఆడుతున్నాము. నేనూ, మా మేనత్త కొడుకు బిహారీచంద్రుడూ మరి యిద్దరమూ ఆడుతున్నాము. ముక్కలు పంచటం అయింది. నేను రెండు డయమండ్సు చెప్పాను. వాళ్లు 'రెండు, రాయల్స' అన్నారు; మా 'బావ' రెండు నోట్రంప్సు అన్నాడు. అగ నిలిచింది. నా ముక్కలు పరచి మా బావదగ్గర ముక్కలు తీసుకొన్నాను. వాడి రెండు చేతులూ చాచి చూడు ఎలాగున్నాయో ముక్కలు అన్నాడు. వాడిచేతిలో ముక్కలకంటే వాడి చేతిలో రేఖలు నన్ను ఆకర్షించాయి. ఏదీ! యిలాగ చూడనీ! అని వాడి చేయి చూశాను. అందరూ ఆశ్చర్యంతో నాకేసి చూస్తున్నారు.

"ఏమిటి బావా! కొత్తవిశేషం కని పిస్తూ ఉందా?" అన్నాడు.

"వాడికి పెళ్ళి ఎపుడు అవుతుందో చెప్పరా బికారీ!" అని మిగిలినవాళ్లు పట్టు కున్నారు. నేను కొంతసేపు మౌనంగా చూస్తూ ఊరుకున్నాను. చాల గొప్ప విశేషం కనిపించింది. ఆ పడుచువాడికి ఆ రాత్రి వివాహం అవుతుందని నేను చెప్పి వేశాను.

"అసంభవం" అని అందరూ పెదవులు విరిచేశారు. 'చూడండి ఏమి జరుగుతుందో' అని తిరిగి మా ఆట సాగించాను.

ఆవేళ సాయంకాలం రావలసిన పెళ్ళి కొడుకువాళ్లు వచ్చారు. రాగానే మా నాన్న గారు వెళ్ళిచూచారు. సాయంకాలం ప్రధానంలో వాళ్లు పెట్టవలసిన వెయ్యి రూపాయల నగలు 'లక్ష్మి' ఒంటిమీద పెట్టవలసి ఉంది. కాని వాళ్ళు పెట్టలేదు. పెట్టకపోతే మా నాన్నకి చాల ఆగ్రహం వచ్చింది. దానిమీద వాళ్లు మాటలు మిగి లారు. మా వంశ, సంప్రదాయం వీటిమీద విమర్శ బయలు దేరదీశారు. ఇలాంటి వాళ్ళతో నిమిత్తం ఏమిటి అని మా నాన్న ఊరుకున్నాడు.

ఆడపిల్ల గలవాళ్లు ఆగ్రహపడకూడదని మా నాన్నని అంతా సమాధాన పరిచారు. ఏమీ ప్రయోజనం లేకపోయింది. ఆయనకి అసలు కోపం రాకపోవాలిగాని వస్తే దాని అంతు చూడవలసిందే.

ఆడపిల్ల గలవాళ్ళకే అంత అహంకారం అయితే మాకేనా తక్కువయింది అని పెళ్ళి కొడుకు తండ్రి మరింత బిఱ్ఱబిగిశాడు. మా పిల్లవాడికి పెళ్లికాకపోతే చూస్తాం— రండి—పోదాం పదండిరా అని నిలుచున్న పాటున లేచి వెళ్లిపోయారు.

మా నాన్నకి చాల పరాభవం అయి పోయింది. వాళ్ళమీద కక్షి తీర్చుకోవ డానికయినాసరే ఆ ముహూర్తానికి పెళ్లి జేసితీరాలని ఆయన పట్టుదల. లక్ష్మికి వరుస కలిసిన పిల్లవాడు, పెళ్లికి వచ్చిన వాళ్ళల్లో ఎవరైనా ఉంటారేమో అని చూచాడు. మా మేనత్త కొడుకు బిహారీచంద్రుడు ఉండనే ఉన్నాడు. పిల్లకీ అందరికీ వాడంటే ఇష్టమే. ఒక్క అభ్యంతరం అల్లా మా నాన్నదే. 'నాయనా! కుమించు ఇంటిలో కల్పవృక్షాన్ని పెట్టుకొని ఊరంతా వెద కాను; కాళ్ళు కడిగి కన్యాధార చేస్తాను! రా!' అని పిలిచాడు. మా అత్తయ్యముఖం, లక్ష్మిముఖం పద్మాలులాగ వికసించాయి. మేమందరమూ ఒక్కసారి విభ్రాంతి పడ్డాం కాని—చివరికి జరిగినదానికి అంద రికీ ఎంతో ఆనందమయింది.

నేను చెప్పిన భవిష్యత్ ఫలాలు లక్ష్మి విషయంలోనూ, బిహారీ విషయంలోనూ అక్షరాలా నిజమయ్యాయి. ఆ పెళ్ళిలో నా హస్తసాముద్రిక కీర్తి మరింత విస్తరి ల్లింది. అప్పటినించీ ఇక వృత్తిగా జీవిస్తు న్నాను. ఎవ్వరికి నేను భవిష్యత్ చెప్పినా నేను ప్రతిఫలం కోరను. వాళ్లే స్వయంగా తమకు తోచింది యిస్తారు. చాలమంది చెప్పినవి నిజం అవుతాయన్నే అంటారు.

ఈ కథంతా వినగానే నేనూ, ఆచార్యాకూడా తిరిగి బికారీని మా భవి ష్యత్తు గురించి ప్రశ్నించాలని బుద్ధిపుట్టింది.

ఇద్దరమూ చేతులు సాచాము.

ఇదివరకు మీకు చెప్పానుకదా అని బికారీ తప్పుకున్నాడు. కాని మేము మాత్రం మాకు మనస్కరించాలని తోచిన ఫలితాలు అతనిచేత చెప్పించుకోవాలనే పట్టుదలలో ఉన్నాం. 'అయితే నాకు బదిలీ ఎపుడు అవుతుంది' అని నేను అడి గాను.

'ప్రమోషన్, వివాహం' ఎప్పుడు అని ఆచార్య అడిగాడు.

మా ఉభయుల ప్రశ్నలకీ సమాధానాలు చెప్పాడు. ఇదివరకు వ్రాసినది కాకుండా మళ్ళీ వ్రాసి యిచ్చాడు.

అది తీసుకొన్న తర్వాత 'బికారీ' వెళ్లి పోయాడు. కొన్ని మాసాలు గడిచి పోయాయి.

ఆచార్యకు బదలీ అయిపోయింది. నాకు బదలీ కాలేదు. తిరిగి ఆచార్యను అతడున్న కొత్త స్థలంలో నేను కలుసుకోవటం తటస్థించింది. తిరిగి బికారీప్రసక్తి వచ్చింది. ఏమిటి మన భాగ్యరేఖ ఎలాగ ఉన్నది. బికారీ వ్రాసి యిచ్చిన కాగితాలు తెరచి చదువుకున్నాం. మా ఇద్దరివిషయాలలోనూ 'బికారీ' చెప్పిన జోశ్యం విఫలం అయిపోయింది. ఒకరి ముఖం ఒకరము చూచుకొన్నాం. భాగ్య రేఖ ప్రతివాడికీ ముందే నిర్ణయం అయి పోయిఉంటుంది. దానిని చెరపడానికీ మార్చడానికీ ఎవ్వరి తరమూ కాదు. కాని మన అవసరంకొద్దీ, ఏవో స్వప్నవాంఛలు కోరుతూ ఆ భాగ్యరేఖలో లేని ఫలితాలు చదువుకోడానికీ, చదివించుకోడానికీ ప్రయత్నం చేస్తాం. యథార్థం కాని తీయని తలపులు సృష్టించుకొని భవిష్యత్తులో జీవిస్తాం. ఆ భవిష్యత్తు చెదిరిపోయి తిరిగి నగ్నమైన వర్తమానం కాగానే చీదరించు కొంటూ అనుభవిస్తాం.

'ఆచార్య సాబ్! ఏమిటి మన భాగ్య రేఖ! ఎప్పటికి నాకు బదలీ? ఎప్పుడు నా ప్రమోషన్' అని అడిగాను.

జీవితంలో ట్రాన్స్ఫరులూ, ప్రమో షన్లూకంటే ఎన్నో విలువైన విషయాలు ఉన్నాయి. ఇది మరిచిపో—మనం బ్రతు కుతున్న జీవితమే—మామూలు మనుగడ.

★

## నపుంసకతైలం

నరములు బలహీనత చెంది చిన్నదైన, తిర్గి యథాప్రకారమై పూర్తి సౌఖ్యమనుభవించుటకు 45 యేండ్ల ప్రఖ్యాతి చెందినది.

1 సీసా రూ. 10/కల్లార్ వి.పి.రూ. 1-0-0.

ఆర్డరుతో రు. 1/- పంపవలెను.

డా॥ రత్నం సన్స్ మెడికల్ హాల్

మ. లక్ పేట బిల్డింగ్స్,

హైదరాబాద్, దక్కన్.

## స్టీల్‌మాస్టరు

(మడత కుర్చీలు)

ధర

రు. 16



అంధ్రదేశ ఏజంట్లు

మాధవ అండ్ కో

పార్కు రోడ్డు, బెజవాడ

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7. Thambu Chetty St., Madr